క్లుప్తంగా

ఆరోగ్య సూచనలు తప్పనిసరిగా పాటించాలి



వైద్యచికిత్సలు చేయించుకుంటున్న ప్రజలు

చిత్తూరు కలెక్టరేట్: ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూచనలు తప్పనిసరిగా పాటించాలని యోగాచార్యులు నరేంద్రకుమార్ అన్నారు. నగరంలోని కట్టన్ ప్రభుత్వ హైస్కూల్‌లో సిద్ధ సమాధి యోగా ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందన్నారు. నగరవాసులకు వైద్య చికిత్సలు చేయించి ఉచితంగా ఆయుర్వేద మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు. 100 మందికి ఉచితంగా సుగర్ పరీక్షలు చేయించామన్నారు. ప్రతి ఒక్కరూ ఒత్తిడిని అధిగమించాలంటే యోగా సాధన చేయాలని తెలిపారు. యోగా చేయడం వల్ల అనేక ఉపయోగాలున్నట్లు చెప్పారు. అనంతరం ఆయుర్వేద డాక్టర్ రమేష్‌బాబును దుశ్శాలువతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యోగాచార్యులు బ్రహ్మయ్య, నగరవాసులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని జైన్ సంఘం ప్రార్థన మందిరంలో ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎస్‌వి అరవింద్ ఐ ఆస్పత్రి వైద్యులచే నిర్వహించిన ఈ శిబిరాన్ని114 మంది సద్వినియోగం చేసుకున్నారు. ఇందులో 52 మంది ఆపరేషన్‌కు ఎంపికయ్యారు. వీరికి ఉచితంగా కంటి ఆపరేషన్, వసతి కల్పిస్తామని సుభాష్ జైన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రేమ్‌చంద్, విశాల్‌జైన్, సాగర్‌జైన్, ప్రవీణ్, లలిత్, జ్యోతి, ఎవంత్, కమలేష్ పాల్గొన్నారు.

కాళియప్పన్ మృతి చాలా బాధాకరం



కాళియప్పన్‌కు నివాళులర్పిస్తున్న విజయానందరెడ్డి

గుడిపాల: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కాళియప్పన్(62) మృతి చెందడం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని చిత్తూరు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి అన్నారు. 189కొత్తపల్లె గ్రామానికి చెందిన కాళియప్పన్ పదిరోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. ఆదివారం ఆయనకు పెద్దకర్మ కార్యక్రమం నిర్వహించారు. విజయానందరెడ్డి పాల్గొని నివాళులర్పించారు. కాళియప్పన్ మన మధ్యలో లేకపోవడం చాలా బాధాకరమన్నారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ప్రకాష్, నాయకులు ప్రసాద్‌రెడ్డి, సుధాకర్‌నాయుడు, రాజా, రజినీకాంత్, కారిమేఘన్, సంపత్, కెపి శ్రీధర్, అన్బు, అను, శేఖర్ ఉన్నారు.


బదిలీ ఉద్యోగికి సన్మానం



బదిలీపై వెళ్తున్న ఏఎస్ఐ శాంతిని సన్మానిస్తున్న పోలీసు సిబ్బంది

తవణంపల్లె: స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ శాంతి బదిలీపై వెళుతున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కల్లూరు పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో సిబ్బంది అమీర్‌బాషా, గజేంద్ర, వినయ్‌రెడ్డి, రఘు, రాజా పాల్గొన్నారు.

బీమా ప్రీమియం.. రైతుకు భారం



ఐరాల చెరువు కింద సాగులో ఉన్న వరి పంట

పంట	బీమా ప్రీమియం(హెక్టారుకు)
వరి	రూ.210
వేరుశనగ	రూ.150
మామిడి	రూ.4,375
టమాట	రూ.3,125

- ఉచిత పంటల బీమా అమలు చేయని కూటమి ప్రభుత్వం
- కర్షకులే ప్రీమియం చెల్లించాల్సిన పరిస్థితి
- వైఎస్సార్‌సీపీ హయాంలో కర్షకుల వాటా చెల్లించిన వైనం
- ప్రభుత్వ తీరుపై రైతుల అసహనం

ఐరాల: ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రూ.20 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలైనా పెట్టుబడి సాయం అందించకుండా చేతులెత్తేసింది. అంతేకాకుండా కర్షకులపై అదనంగా పంట బీమా ప్రీమియం భారం మోపింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచిత పంటల బీమా అమలు చేసి, పరిహారం కూడా అందించిందని రైతులు గుర్తుచేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం దగా చేసిందని మండిపడుతున్నారు.

గత ప్రభుత్వంలో భరోసా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా నిలిచింది. రైతు భరోసా పథకం కింద ఏటా రూ.13,500 కర్షకుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో నగదు జమచేసింది. అంతేకాకుండా బీమా ప్రీమియం రైతు వాటా ప్రభుత్వమే చెల్లించి తోడుగా నిలిచింది. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే అదే సీజన్‌లోనే రైతుకు పంట నష్టం కింద పరిహారాన్ని అందించి ఆదుకుంది. వ్యవసాయాన్ని పండగలా మార్చింది. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులను నియమించి కర్షకులకు బాసటగా నిలిచింది.



నాడు ఉచిత పంటల బీమా మొత్తాన్ని విడుదల చేస్తున్న అప్పటి సీఎం వైఎస్ జగన్ (ఇన్‌సెట్) నేడు ఉచిత బీమాను రద్దు చేస్తూ సీఎం చంద్రబాబు ప్రకటన

ఇప్పుడు పరిస్థితి ఇలా!

ఎన్నికల సమయంలో రైతులకు ఏటా అన్నదాత సుఖీభవ కింద ఏటా రూ.20 వేలు అందిస్తామని హామీ ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఖరీఫ్, రబీ సీజన్ పూర్తి అవుతున్నా రైతులకు పెట్టుబడి సాయం చేయలేదు. దీనికి తోడు రైతులకు ఉచిత బీమా పథకానికి కూడా మంగళం పాడింది. బీమా పరిహారం కావాలంటే ప్రీమియం కూడా రైతే చెల్లించుకోవాలని చెప్పడంతో వ్యవసాయం భారంగా మారింది. రైతులు పండించిన పంటలు అమ్ముకోవాలంటే గిట్టుబాటు ధర లేక రైతు దిగులు చెందుతున్నారు.

ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించాలి



రైతును ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు సంబంధించి ఏ పథకం సక్రమంగా అమలు కాలేదు. పెట్టుబడి సాయం అందక సాగు కష్టంగా మారింది. వర్షాభావ పరిస్థితులతో తీవ్రంగా నష్టపోయాం. బీమా ప్రీమియం చెల్లింపు భారంగా మారింది. బీమా ప్రీమియం రైతుల వాటాను ప్రభుత్వమే చెల్లించాలి. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి.

–బాలాజీరెడ్డి, సీవీ.పల్లె, ఐరాల

రైతులపై భారం తగదు



కూటమి ప్రభుత్వం రైతుకు ఇచ్చిన హామీలు అమలు చేసి అండగా ఉంటుందనుకున్నాం. అయితే అందుకు విరుద్ధంగా ప్రస్తుత పరిస్థితి నెలకొంది. పెట్టుబడి సాయంగా రైతులకు రూ.20 వేలు అందజేస్తామని కూటమి నేతలు ఇచ్చిన హామీని విస్మరించారు. పెట్టుబడి సాయం ఊసే ఎత్తడం లేదు. రైతుల సమస్యలను పట్టించుకోని కూటమి సర్కార్ బీమా ప్రీమియం రైతులే చెల్లించుకోవాలనడం చాలా బాధాకరం.

– ప్రభాకర్‌రెడ్డి, 35 యర్లంపల్లె, ఐరాల

ప్రీమియం చెల్లించాలి



రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఈ–క్రాప్ నమోదు చేసుకుని రైతులే పంట బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంది. ప్రీమియం చెల్లించకుంటే ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన పంటలకు నష్టపరిహారం రాదు. ఇది గుర్తుంచుకుని ప్రతి రైతు పంటల బీమా ప్రీమియం చెల్లించి పంటలు కాపాడుకోవాలి.

– వరలక్ష్మి, ఏఓ, ఐరాల

నోటీస్ బోర్డు

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

తవణంపల్లె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రెడ్డిబాబు తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిశీలించి పరిష్కరిస్తామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని తెలిపారు.

ఐరాల మండలంలో..

ఐరాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహేష్‌కుమార్ తెలిపారు. కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రజలు అర్జీలు సమర్పించి సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని సూచించారు.

నేడు ఫ్యామిలీ డాక్టర్

తవణంపల్లె: మండలంలోని మాధవరంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. గ్రామంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. మాధవరం పరిసర గ్రామాల్లోని ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొని వైద్య సేవలు అందుకోవాలని ఆమె కోరారు.

వేదగిరివారిపల్లెలో..

ఐరాల: మండలంలోని వేదగిరివారిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. గర్భిణులకు బీపీ, షుగర్, థైరాయిడ్, గుండె సంబంధిత పరీక్షలు చేసి తగు సూచనలు, సలహాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం

తవణంపల్లె: మండల కేంద్రంలో సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. మండల కేంద్రంలో వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహిస్తామని ఆమె వివరించారు.

25న విద్యుత్ అదాలత్

కార్వేటినగరం: స్థానిక ట్రాన్స్‌కో ఏడీఈ కార్యాలయ ఆవరణంలో 25న మంగళవారం విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు చిత్తూరు రూరల్ డివిజన్ ఈఈ ఎస్.సురేష్‌కుమార్ ఆదివారం విలేకరులకు తెలిపారు. దీర్ఘకాలంగా వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

భూమిని ఆక్రమించారు.. బెదిరిస్తున్నారు



సమావేశంలో మాట్లాడుతున్న గ్రామస్తులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): గ్రామకంతం భూమిని ఆక్రమించుకోవడంతో పాటు బెదిరిస్తున్నారని గంగాధరనెల్లూరు మండలం రామానాయుడుపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో 5 సెంట్ల వరకు గ్రామకంతం భూమి ఉందన్నారు. ఆ భూమిలో కమ్యూనిటీ భవనం నిర్మించుకున్నామన్నారు. మిగిలిన స్థలాన్ని అంగన్‌వాడీ కేంద్రం, వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి ఉంచామన్నారు. దీనిపై కన్నుపడ్డ కొందరు వ్యక్తులు ఆ భూమిని ఆక్రమించారని పేర్కొన్నారు. ఈ విషయమై పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఆక్రమణను ప్రశ్నిస్తే ఆక్రమించుకున్న వ్యక్తి బెదిరింపులకు గురిచేస్తున్నాడన్నారని ఆరోపించారు. ఇందుకు అధికార పార్టీ అండదండలున్నాయని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణను తొలగించాలని కోరారు. ఈ సమస్యకు సచివాలయ సిబ్బందికి ఎలాంటి సంబంధం లేదని వివరించారు. సమావేశంలో బాబు, రాజేంద్ర, శేఖర్, వెంకటస్వామి, విశ్వనాథం పాల్గొన్నారు.

ఉల్లాస్ పరీక్షకు 213 మంది హాజరు

గుడిపాల: ఉల్లాస్ అక్షరాస్యత అర్హత పరీక్షకు 213 మంది హాజరైనట్లు ఇందిరా క్రాంతి ఏపీయం సుధారాణి తెలిపారు. మండలంలోని 20 కేంద్రాల్లో ఆదివారం జాతీయ సార్వత్రిక విద్యాపీఠం సహకారంతో వయోజన విద్య ఉల్లాస్ కార్యక్రమంలో నమోదైన వయోజనులకు ఈ పరీక్షను నిర్వహించామన్నారు. మూడు నెలల క్రితం వీరికి పుస్తకాలను అందజేసి నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు తయారు చేసుకొని వారిని తీర్చిదిద్దినట్లు తెలిపారు. అనంతరం 189 కొత్తపల్లెలో జరిగిన పరీక్ష కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఆమెతో పాటు వెలుగు సీసీలు లోకనాథరెడ్డి, సహదేవ్ పాల్గొన్నారు.



పెరుమాళ్లకండ్రిగలో పరీక్షలు రాస్తున్న సంఘ సభ్యులు

డ్వాక్రా మహిళలకు రాత పరీక్ష

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు మండలంలో ఆదివారం డ్వాక్రా సంఘ సభ్యులకు పరీక్ష నిర్వహించారు. మండల వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, సంఘమిత్రల సమక్షంలో పరీక్షలు నిర్వహించారు. మూడు నెలలుగా సంఘాల్లోని నిరక్షరాసులకు సంఘమిత్రలు అక్షరాలు నేర్పించారు. ప్రాథమిక విద్యను బోధించారు. ఈ మేరకు పరీక్షలను నిర్వహించారు. వీఓ పరిధిలో నిర్వహించిన ఈ పరీక్షలకు డ్వాక్రా గ్రూపు సభ్యులు ఆసక్తిగా పాల్గొన్నారు.



గుడిపాల: పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏపీఎం సుధారాణి

రసాయనిక ఎరువులతో నాశనమే

- భూసారాన్ని రక్షించుకోకుంటే ముప్పే
- భూముల్లో భారీగా తగ్గిన సేంద్రియ కర్బనం
- ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి పెంచుకోవాలి

పలమనేరు: రైతన్నలకు తెలీకుండానే భవిష్యత్తులో పెద్ద ఉపద్రవం రానుంది. రైతులు రసాయనిక ఎరువులను విపరీతంగా పొలాలకు వాడి మరో నాలుగైదేళ్లలో సాగు భూములు నిస్సారంగా మారనున్నాయి. పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌లోని సాగు భూముల్లో నత్రజని (సేంద్రియ కర్బనం) భారీగా తగ్గిందనే చేదు నిజం భూసార పరీక్షల్లో తేటతెల్లమైంది. దీంతో ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు సేంద్రియ విధానాలను అవలంభించేలా వ్యవసాయశాఖ నడుంబిగించింది. దీనిపై రైతులు కూడా ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

భూములు కాపాడుకోవాలంటే...

- యూరియాను మోతాదుకు మించి పంటలకు వాడరాదు
- పచ్చరొట్ట ఎరువులు వాడాలి.
- నేలకోతలను అరికట్టాలి.
- భూమిలో తేమ పరిరక్షణకు కృషిచేయాలి
- వర్షపు నీరు పొలాల్లోనే ఇంకేలా చూడాలి
- సేంద్రియ ఎరువులను విరివిగా వాడుకోవాలి
- పంటమార్పిడి చ్చితంగా పాటించాలి

ప్రకృతి వ్యవసాయమే ప్రత్యామ్నాయం

పాత పద్దధ్ధరాను రైతులు రసాయనిక ఎరువుల వాడకం, మోతాదుకు మించిన క్రిమిసంహారక మందులతో భూసారాన్ని కోల్పోయారు. దీంతో మళ్లీ ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో పంట పెట్టుబడులు పెరిగాయని రైతులు చెబుతున్నారు.



మొరంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు

అవగాహన కల్పిస్తున్నాం

సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. చాలామంది రైతులు సహజ పద్ధతుల్లో వ్యవసాయం చేసేందుకు అలవాటు పడుతున్నారు. రసాయనిక ఎరువులను వాడకంతోనే భూములు సారాన్ని కోల్పోయాయి. దీంతో పంటలు సరిగ్గా పండడం లేదు. అందుకే నేచురల్ ఫామింగ్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

–సంధ్య, వ్యవసాయశాఖ ఏఓ, పలమనేరు

భగత్‌సింగ్‌కు సీపీఐ నాయకుల నివాళి



చిత్తూరులో గాంధీ విగ్రహం వద్ద భగత్ సింగ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా సీపీఐ నాయకులు నివాళి అర్పించారు. నగరంలోని గాంధీ విగ్రహం వద్ద ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. బ్రిటీష్ పాలకులను గడగడ లాడించిన గొప్ప పోరాట యోధుడు భగత్‌సింగ్ అని జిల్లా కార్యదర్శి నాగరాజన్, సహాయ కార్యదర్శి జనార్దన్ తెలిపారు. స్వాతంత్య్ర సాధనలో ప్రముఖ పాత్ర వహించి ప్రాణత్యాగానికి సైతం వెనుకాడని విప్లవ వీరుడని కొనియాడారు. దేశానికి స్వరాజ్యంతో పాటు పేదలకు కూడు, గూడు, విద్య, వైద్యం, ఉపాధి ముఖ్యమని చాటిచెప్పారన్నారు. ప్రస్తుతం దేశంలో కుల, మతాల పేరిట పాలకులు విభజన రాజకీయాలకు చేస్తున్నారని చెప్పారు. రష్యా విప్లవాన్ని ఆదర్శంగా తీసుకొని లెనిన్ పోరాట స్ఫూర్తితో అమరజీవి భగత్‌సింగ్ ఆశయసాధనకు ఉద్యమించారన్నారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్పొరేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడడమే అమరజీవికి అసలైన నివాళి అన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపినాథ్, దాసరి చంద్ర, జయలక్ష్మి, మణి, కవిత, బాలాజీరావు, శ్రీరాములు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPLE CIVIL JUDGE (SENIOR DIVISION), CHITTOOR.
S.O.P.NO. 2 OF 2025

M.Sireesha and another ...Petitioners

Vs

S.Lakshmi and others ...Respondents

జనరల్ నోటీసు

[illegible]

SCHEDULE

The details of death benefits payable by the 3 Respondent on the death of S.Ramesh are as follows:

1.	GIS :	Rs. 40,000-00
2.	HPL :	Rs. 15,000-00
3.	E.L	Rs. 52,000-00
4.	APGLI:	Rs.1,50,000-00
5.	Bhadratha:	Rs. 4,00,000-00
6.	Corpus Fund	Rs. 26,000-00
7.	GPI	Rs. 6,05,000-00
	Total:	Rs. 12,97,000-00

2/3rd share of petitioners Rs.8,64,666-00

K.P.KUMARASWAMY
వాది తరపున న్యాయవాది

ఘనంగా కమ్మవారి ఆత్మీయ సమ్మేళనం



కమ్మవారి అభ్యుదయ సేవా సంఘం నూతన కార్యవర్గం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని మిట్టూరులో ఆదివారం కమ్మవారి అభ్యుదయసేవా సంఘం ఆధ్వర్యంలో కమ్మవారి ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ముందస్తు ఉగాది సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. గౌరవ అధ్యక్షులుగా చెన్నకేశవులు నాయుడు, అధ్యక్షులుగా మోటుపల్లి కేశవులు నాయుడు, కన్వీనర్‌గా రామ్మూర్తి నాయుడు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు నాయుడు, ధనంజయ నాయుడు, సెక్రటరీగా సతీష్ కుమార్, జాయింట్ సెక్రటరీగా పాటిబండ్ల చిట్టిబాబు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గురజాల జగన్ మోహన్, గాలి భాను ప్రకాష్ పాల్గొన్నారు.

టౌన్‌బ్యాంకు సభకు కోరం ఏదీ?

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం గిరింపేటలోని ది చిత్తూరు కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంక్‌లో ఆదివారం మహాజన సభను నిర్వహించారు. ఖాతాదారులు చాలా మంది ఈ సభకు ముఖం చాటేశారు. 1/3వంతు మంది హాజరు ఉంటేనే సభ నిర్వహించాల. కానీ ఈ సభకు ఆ సంఖ్యా బలం లేకున్నా అధికారులు కొనసాగించారు. తూతూమంత్రంగా జరిపించారు. నిర్వహణ లోపల కారణంగానే ఖాతాదారులు సభకు రాలేదని పలువురు ఆరోపణలు చేశారు. దీనిపై మీడియా వేసిన ప్రశ్నలకు బ్యాంకు అధికారులు బిక్కమోహం పెట్టారు. సాధారణ సభే కదా, కోరం ఉండాలి కానీ అంటూ గుటకలు మింగారు. ఇప్పుడిప్పుడే బ్యాంకు లాభాల బాటలోకి తీసుకొస్తున్నామని కోరం మాటను దాటవేశారు. తొలుత బ్యాంకు ఓఎస్‌డీ నారాయణమ్మ బ్యాంకు లావాదేవీలను వెల్లడించారు. బ్యాంకు మోసాలను కూడా వివరించారు. సభా ప్రారంభంలో కొంత మంది బ్యాంకు సిబ్బంది జీతాలు లేదని ప్రస్తావనకు తీసుకొచ్చారు. దీనిపై అధికారులు పట్టించుకోకపోవడంపై వారు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు.



మీడియాతో మాట్లాడుతున్న బ్యాంకు అధికారులు